


# ఎదురుతిరిగిన అవమానం

ఆంగీరస

ఆఫీసులో పని చేసుకుంటున్న రఘు, తనకు యింటినుంచి వచ్చిన అర్జెంటు టెలిగ్రాము చూచి నిస్తేపోయాడు. తక్షణం బయలుదేరి రావలసిందన్ని అతని తండ్రి హైదరాబాదునుంచి ఇచ్చిందది. కారణం ఏమీ తెలపలేదు. ఫలానా కారణం అయి వుంటుందని ఊహించడానికైనా అతనికి ఆధారం దొరకలేదు. పదిహేనురోజుల క్రిందటే తాను హైదరాబాదునుంచి తిరిగివచ్చాడు. అప్పటికి యింట్లో తల్లిదండ్రులూ, చదువుకొంటున్న తమ్ముడూ క్షేమంగా ఉన్నారు. తాను దగ్గరవుండి పరిష్కరించవలసిన వ్యవహారమేమీలేదు. ఇంతకూ ఆ కుటుంబంలో వ్యవహారాల ప్రసక్తేలేదు. తండ్రి గోపాలంగారు నిక్కచ్చి మనిషి. చాలా మర్యాదస్తుడు. చాలా ఉత్తముడనిపేరు గడించుకొన్నాడు. గవర్న మెంటులో పెద్ద వుద్యోగంచేసి ఆస్తి పాస్తులు సంపాదించుకుని ఈ మధ్యనే రిటైరయ్యారు. నెలకు నాలుగువందలు పింఛను వస్తుంది. కుటుంబమూ పెద్దది కాదు. టెలిగ్రాం—అందులోను ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం రావడానికి కారణం తెలియక రఘు చాలా కలతపడసాగినాడు.

రైల్లో ప్రయాణం చేస్తున్న రఘు మనస్సు రైలుతోపాటు పరిపరివిధాల పరుగెత్తసాగింది. పర్వత గుహలద్వారా ప్రయాణం చేస్తున్నప్పుడు తానున్న పెట్టెతోపాటు హృదయంకూడా చీకటిలో మునిగిపోయినట్లు తోచింది. బడలిక హెచ్చుగా తోచింది. ఆకలిగావున్నా యేదీ తినడానికి మనస్కరించడంలేదు. ఎలాగో గమ్యస్థానం చేరుకున్నాడు.

బండీదిగి టాక్సీ చేయించుకుని యింటికి వెళ్ళి హాండ్‌బాగుతో ఇంట్లో ప్రవేశించే సరికి ముఖంలో సంతోషాన్ని [illegible]

తల్లి సుభద్ర యెదురుగావచ్చి 'నాయనా! వచ్చావా! చాలా సంతోషం! నీవు వస్తావో, రావో అని సందేహంతో చాలా కలతపడుతున్నాను' అని అంటూ, అతని చేతిలోంచి సంచీ తీసుకుంది. 'అర్జెంటు టెలిగ్రాం యివ్వవలసిన అగత్యం ఏమి వచ్చిందమ్మా? ప్రమాదకర పరిస్థితులేవీ సంభవించలేదు కదా?' అని రఘు ఆతురతతో అడిగాడు.

'అలాటి దేమీ లేదు నాయనా! ఒక ముఖ్య విషయాన్ని గురించి నిశ్చయించడానికి నిన్ను ఇలా పిలిపించవలసి వచ్చింది. ఆ విషయం తర్వాత చెప్తానుగాని, ముందు కాళ్ళూ, చేతులూ కడుక్కోని రా. ఇంత ఫలహారం చేసి, కాఫీ తీసుకుందువుగాని, దూర ప్రయాణం చేసి చాలా అలసిపోయావు.' అంటూ తల్లి తొందర పెట్టింది. రఘు గబగబా గదిలోకి వెళ్ళి ఆ దుస్తులు తీసి వేసి కొళాయి దగ్గరకు వెళ్ళి కాళ్ళూ, చేతులూ కడుక్కొని గదిలో కూచుని ఫలహారం చేస్తున్నాడు

ఆ సమయంలో గోపాలంగారు త్వరత్వరగా యింట్లోకి వస్తూ దూరంనుంచే భార్యనుచూచి 'ఏమిటి, అబ్బాయి వచ్చాడా? పదిగంటల బండిలో వాళ్ళు పిల్లను తీసుకుని వస్తున్నారు. సికిందరాబాదులో బస! మనం మధ్యాహ్నం రెండుగంటలకి అక్కడికి వెళ్ళాలి?' అంటూ కుర్చీలో కూలబడ్డారు.

సుభద్ర 'వచ్చాడు, యిప్పుడే, కాఫీ తాగుతున్నాడు. ఇంకా యీ ప్రస్తావన తేలేదు. నిదానంగా చెప్పాలని అనుకుంటున్నాను' అన్నది.

వీరిమాటలు గదిలోనుంచి వింటున్న రఘుకు ఏదో పెళ్ళిసంబంధం గురించే యీ తతంగం అంతా అని అర్థమయింది. ఇంతలో తండ్రి అతనిదగ్గరకు వచ్చి 'నాయనా! ప్రయాణంవల్ల చాలా బడలిక కలిగి వుంటుంది. భోజనంచేసి కాసేపు విశ్రమించు. మనం రెండుగంటలకి సికిందరాబాదు వెళ్ళాలి. వివరాలన్నీ మీ అమ్మ తెలియజేస్తుంది' అని చెప్పి ఏదో పనిమీద వెళ్ళిపోయాడు.

రఘు కొంత చికాకుతో తల్లిదగ్గరకు వచ్చి 'ఏమిటి యీ హంగామా అంతా? పెళ్ళి చాపత్రయమేనా? ఈసంగతి నాకు తెలిపివుంటే ఎంతో బాగావుండేదే! ఎంత అందోళనపడ్డానో నీకేం తెలుస్తుంది?!!' అని అన్నాడు.

'పెళ్ళిని గురించే అని నీకు తెలిస్తే, నీవు వస్తావనే నమ్మకంలేక యీ సంగతి తెలియజెయ్యలేదు. ఇంతకూ మేం ఏమి తలపెట్టినా నీ మంచికోసమే అనుకో! గూరాబారాన్ని ఉన్నావుగదా! పెళ్ళిచేసుకోకుండా బ్రహ్మచారిగా ఎన్నాళ్ళు హోటలు మెతుకులు తిని కాలక్షేపం చెయ్యగలవు? కోడలు యింటికివస్తే కళ్ళారా చూడాలని నాకు ఎంతో ఆత్రంగా ఉన్నది.'

'అయితే కోడలు యింటికి రావడానికని యావజ్జీవమూ నన్ను బాధపడమంటావన్నమాట.'

'బాధపడటమేమిటి? లక్షణంగా నువ్వు భార్యతో కాపరం చెయ్యాలనే మా కోరిక. అది తప్పు కోరేదేమీ లేదు.'

'అందుకని ఆశయాలన్నింటినీ చంపుకుని మీ సంతృప్తికోసం మీ ఆజ్ఞను వర్తిస్తే ఉండాలా?'

'మేము ఆవిధంగా కోరలేదు. అమ్మాయి మంచి సంప్రదాయంగల కుటుంబంలో పుట్టింది బుద్ధిమంతురాలు. చదువుకున్న గర్వమసలే లేదు. ఎంతో అందంగా వుంటుంది. ఇంటి నియమాలు ఉన్నది ఆ వివరాలన్నీ మంగతాయమ్మగారివల్ల తెలిశాయి. ఆవిడకు వాళ్ళను గురించి బాగా తెలుసునట! నువ్వు ఆ అమ్మాయిని చూడగానే గ్రహించగలవు. నీకు నచ్చితేనే యీ సంబంధం నిశ్చయించుకుందాము. లేకపోతే ఏంపోతుంది. యిన్ని నా మాటలకు ఎదురుచెప్పవనే ధైర్యంతోనే పిల్లను చూడడానికి వస్తామని మాట యిచ్చాము. మరి అడ్డుచెప్పకు.'

రఘు మరి యేమీ చెప్పలేకపోయాడు.

రెండు గంటలకు ముగ్గురూ బయలుదేరి టాక్సీలో సికిందరాబాదు, కన్యాదాత గోవర్ధనంగారు బసచేసిన గృహానికి వెళ్ళారు. గృహ యజమానీ, గోవర్ధనంగారు ఎంతో మర్యాదలతో వీరిని లోపలికి తీసుకుని వెళ్ళారు.

పరస్పర పరిచయాలు జరిగాక కొంత సేపు వినోద సంభాషణలతో కాలం గడిచింది. తరువాత పెళ్ళికూతురు చేతనే కాఫీ, ఫలహారాలు యిప్పించి, ఆమెను అందరూ చూడడానికి అవకాశం కల్పించారు. రెండు పక్షాల వారికీ కాబోయే వధూవరులు నచ్చారు. రఘుకు ఆ సంబంధం అనిష్టంగా తోచలేదు. కన్య ముఖలక్షణాలలో అనుకూల్యమే ద్యోతకమైంది.

గోవర్ధనంగారు 'తమతో బంధుత్వం జరపడమే మా ప్రధానోద్దేశం. దీనికి దైవం అనుకూల్యాన్ని చూపడం మా అదృష్టం! శీఘ్రంగా ముహూర్తాన్ని నిర్ణయిస్తే మేము సర్వసిద్ధంగా ఉంటాము.' అని గోపాలంగారితో వినయపూర్వకంగా విన్నవించారు.

గోపాలం—మేము కోరేదికూడా అదే! శుభస్య శీఘ్రం అని పెద్దలన్నారు కదా! రెండు జాతకాలకూ అనుకూలంగా వేగంగానే ముహూర్తం నిర్ణయిద్దాం.

గోవర్ధనం—చాలా సంతోషం! మరి కట్నం విషయమై బావగారు తమ అభిప్రాయాన్ని సెలవిచ్చారు కారు. అది తెలిస్తే మేం ముందుగా జాగ్రత్తపడవలసి వుంటుంది.

గోపాలం కట్నం పుచ్చుకోవడం మా అబ్బాయికి సమ్మతం కాదు. మా దంపతుల అభిప్రాయమూ అదే! దైవవశాత్తూ మాకు ఆడపిల్లలు కలగలేదు కాని, ఒక వేళ కలిగి వుంటేను మా పద్ధతి యిదే! మేం ఎవ్వరికీ కట్నాలు యివ్వం. మేము పుచ్చుకోము కూడా

గోవర్ధనం- మీకు ఎదుటివారిని నిర్బంధించి కట్నం పుచ్చుకోవడం యిష్టం లేకపోవచ్చు. ఎదుటివారు మా శాహత్తున్నా, వరుడి యోగ్యతలను అనుసరించి సంతోషంతో యిస్తే స్వీకరించడంలో తప్పేమీ వుండదు గదా!

గోపాలం—కన్యాదాత వరశుల్కం యిస్తే వరుణ్ణి కొనుక్కున్నట్లే కదా అర్థం. మా అబ్బాయి వెలకు అమ్ముడుపోవడం మాకు యిష్టం లేదు.

గోవర్ధనం- తమరు అలా భావించకూడదు. వరుడికి దక్షిణ యివ్వడం నిషిద్ధం కాదు. వివాహ తతంగంలో వరదక్షిణ ఒక అంగమని తమకు తెలియనిది కాదు. అందువల్ల దీన్ని శుల్కంగా భావించనక్కరలేదు. దానానికి దక్షిణ అవసరం కూడా.

గోపాలం—అలాగున అయితే వివాహ సమయంలో కన్యాదానం చేసేటప్పుడు

లాంఛనప్రాయంగా అయిదో, పదో దక్షిణగా యివ్వాలి.

ఈ మాటలకు గోవర్ధనంగారు ఎంతో ఆశ్చర్యపడ్డారు. 'ఎట్టి యోగ్యతలూ లేని వరులుకూడా వేలకొద్దీ కట్నాలు పిండుతున్న యీ కాలంలో హోదాగల కుటుంబంలో పుట్టి కేంద్రప్రభుత్వంలో పెద్ద ఉద్యోగంలో ఉన్న విద్యావేత్త అయిన వరుడికి కట్నం అక్కర్లేదని తిరస్కరించే ఉదార హృదయులు యీ కాలంలో వుండడం చాలా ఆశ్చర్యంగా ఉన్నది. ఎంతో అదృష్టం వున్నవారికే మీవంటివారితో బంధుత్వం కుదురుతుంది. మేమెంతో ధన్యులం అని' ఆయన గోపాలం గారిని చాలా ప్రశంసించారు. ముహూర్త నిర్ణయం వీలైనంత శీఘ్రంగా జరగాలని మరీ మరీ కోరారు.

* * *

పెళ్ళికూతురి తండ్రి వధువును తీసుకుని ఏలూరికి వచ్చాడు. సంబంధం కుదిరిన సంగతి వారున్న వీధిలో అందరికీ తెలిసిపోయింది. పెద్ద హోదాలో ఉన్నవారితో అంత సులభంగా బంధుత్వం కుదరడం చాలా ఆశ్చర్యం అనిపించింది. ఎంతోమందికి వివరాలుమాత్రం ఎవరికీ తెలియలేదు.

గోవర్ధనంగారి బావమరిది ఆ వూరిలోనే ఉన్నాడు. అతనికి యీవార్త చెవినిపడగానే ఆశ్చర్యం కలిగింది. తన బావగారు ఎక్కువ వరకట్నానికి తూగగలవారుకారని అతనికి తెలుసును. అతను త్వరగా ఆయింటికి వెళ్ళి వివరాలన్నీ తెలుసుకున్నాడు. మేనకోడలికి పెళ్ళి కుదిరిన సంతృప్తి అతనికి కలగలేదు. కొంచెంసేపు ఆలోచించి బావగారితో ఇలా అన్నాడు.

'సులభంగా పెళ్ళి కుదిరినందుకు బావగారు సంతోషిస్తున్నారు కాని నాకు ఒక్క సందేహం కలుగుతున్నది. పెద్ద ఉద్యోగం చేస్తూ, అందంగావున్న పిల్లవాడు కట్నం ఆశించలేదంటే దానికిదయినా ఒక కారణం వుండాలి గదా!'

'కట్నాలు యివ్వడమూ, గ్రహించడమూ వారి ఆదర్శాలకు విరుద్ధమట.'

'ఈమాటలకేమిటిలెండి? ఈ కాలంలో ఆదర్శాలు అనేవాటిని ఇనపపెట్టెలోపెట్టి పది బీగాలువేస్తే వీళ్ళు ఉంచవలసిందే!

# ఎదురు తిరిగిన ఆదర్శం

డబ్బుకావాలి కాని, ఆదర్శాలు ఎవరికి కావాలండీ యిప్పుడు? ఆడపిల్లలు లేకపోవడం సరిపోయింది కాని, ఉండేటట్లయితే తెలిసివచ్చేది అయ్యగారి బిగువు; కట్నం యివ్వకుండా వరుడు ఎలా దొరుకుతాడో!'

'నాకు యిది ఆశ్చర్యంగానేతోచింది.'

'అందరికీ తోస్తుంది యిలాగే! కట్నం అడగపోవడానికి వరుడిలోవుండే యేదోలోపమే కారణమై వుంటుందని నా అనుమానం.'

ఈమాట విని గోవర్ధనంగారు కొంత దిగులుపడ్డారు. బావమరిదిమాట తనకూ సబబుగానే తోచింది. ఫలానా అని నిర్ణయించలేకపోయినా వరుడిలో తప్పక లోపం ఉంటుందని నిశ్చయించుకున్నారాయన.

ఆ తర్వాత ఆయన భార్యతో యీ విషయమై సంప్రతించారు. ఆమెకు కూడా అనుమానం కలిగింది. ఏదో దీర్ఘవ్యాధిగాని, అవయవలోపంగాని ఉండితీరాలనే అందరూ నిర్ణయించారు.

అందరూ ఆలోచించుకుని 'కొన్ని ఆర్థిక పరిస్థితులు అనుకూలంగాలేని కారణమున ప్రస్తుతంలో అమ్మాయికి వివాహంచెయ్యడం కుదరడంలేదు' అని విచారాన్ని తెలుపుతూ గోపాలంగారికి జాబువ్రాయడం జరిగింది.

గోపాలంగారు ముహూర్తాన్ని నిశ్చయించే లోపలనే యీజాబు అందింది. ఖచ్చితమైన సంబంధం తప్పిపోయినందుకు ఆయన కొంత కలతపడ్డారు. చక్కని అమ్మాయి కోడలు కాకుండా తప్పిపోయినందుకు సుభద్రమ్మకు కష్టమనిపించింది. రఘుమాత్రం వీటిని వేనిని పట్టించుకోలేదు. పదిరోజుల సెలవు మీదవచ్చినందున రెండు మూడురోజులు అక్కడేవుండి తిరిగి ఢిల్లీకి వెళ్ళిపోయాడు.

పెళ్ళి సంబంధం కుదిరిన సంగతి తెలిసినట్లే, తప్పిపోయిన సంగతి కూడా గోవర్ధనంగారి బంధువుల్లో కొందరికి తెలిసినది. కారణంమాత్రం యెవ్వరికీ తెలియలేదు. తమవద్ద ఆడపిల్లలున్న కొందరు దీనికి చాలా సంతోషించారు. ఒకరిద్దరు విషయాన్ని స్పష్టంగా తెలుసుకోవడానికి గోవర్ధనంగారి మిత్రులద్వారా ప్రయత్నించారు, వివరాలు తెలుసుకుని తమ పిల్లల కోసం ప్రయత్నంచెయ్యాలనే సంకల్పంతో. అయినా విశేషం లాభంలేకపోయింది. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంవల్లనే ఆ సంబంధం మానుకొన్నట్లు తెలిసింది.

పరిస్థితులు బాగాలేకపోతే మొదట్లో ఎందుకు ప్రయత్నించాలి? ఊరినుంచి వచ్చిన వెంటనే సంతృప్తిగాఉండి, తర్వాత అభిప్రాయం మార్చుకోడానికి కారణంయేమిటి? మగపెళ్ళివారు ఎక్కువ కట్నం కోరారేమో? ఇలాటి సందేహాలు ఉదయించాయి కొందరికి. ఎలాగో గోపాలంగారి చిరునామా తెలుసుకుని ఒకరిద్దరు హైదరాబాదువెళ్ళి తమ కుమార్తెలను చేసుకోవలెనని ప్రాధేయపడ్డారు.

నిశ్చయమైన సంబంధం హఠాత్తుగా తప్పిపోయినందున గోపాలంగారి మనస్సు చాలా కలతపడుతూ ఉన్నది. ఇందుకోసం రఘును శ్రమపెట్టి హైదరాబాదు రప్పించినందుకు చాలా విచారం కలిగింది కూడా. దానితోపాటు వీలయినంత శీఘ్రంగా వివాహం జరిగించడమే ఉత్తమమని తోచింది కూడా. ఈసారి కుమారుడిని రప్పించకుండా తామే కన్యను చూచి నిశ్చయించాలని ఆయన సంకల్పం. ఇట్టి సంకల్పంతో ఉన్న గోపాలం వద్దకు ఒకరిద్దరు కన్యాదాతలు రాగానే మనస్సుకు కొంత నెమ్మది కలిగింది.

కన్యాదాతలు తమ కుమార్తెలను గోపాలం దంపతులకు చూపించడానికి హైదరాబాదు తీసుకునివచ్చి బంధువుల యిళ్ళల్లో బస చేశారు. వారి ప్రార్థనవల్ల వీరు బంధువులను చూడడం కూడా జరిగింది. అమ్మాయిలు లక్షణంగా ఉన్నారు. చదువుకున్నవారు కూడా. నచ్చారు కూడా. ఈ తంతు అంతా చాలా రహస్యంగానే జరిగింది. ఏమంటే—ఒకసారి సంబంధం తప్పిపోయాక జాగ్రత్తగా వుండడం మంచిదని గోపాలంగారికి తోచి, ఊళ్ళోవారికి తెలియకుండా వుండేటట్లే సంప్రతింపులు జరిపారాయన. కన్యాదాతలలో — ఒకరికి తెలియకుండా యింకొకరితో మాట్లాడి, వివరాలతోకూడా కన్యక ఫొటోను కుమారునికి పంపిస్తాననీ, అతని అభిప్రాయాన్ని తెలుసుకుని తెలియజేస్తాననీ చెప్పారు. కట్నాల సంగతి రాగా, తాము వరశుల్కం తీసుకొనుట కిష్టపడమనీ,

# ఎదురుతిరిగిన ఆదర్శం

దానిని గురించిన ఆలోచన పెట్టుకోవద్దని స్పష్టంగా చెప్పివేశారు.

కన్యాదాతలు వెళ్లిపోయారు, వధువుల ఫోటోలిచ్చి, వాళ్ళు సంతృప్తిపడి వెళ్ళిపోయారేకాని, వారిమనస్సులలో కూడా—కట్నం అక్కరలేదనడంతో — సందేహం కలిగింది. వరుడిలో ఏదో లోపం వుండి వుండాలనీ, లేకపోతే ఖండించి కట్నం నిర్ణయించి వుండురనీ వారికి తోచింది. వరుణ్ణి రప్పిస్తామని చెప్పకుండా, వివరాలు తెలియజేస్తామనీ, అతని అభిప్రాయాన్ని తెలుపగలమనీ చెప్పడం వల్ల సందేహానికి దోహదం యిచ్చింది. తమ వూళ్ళకు వెళ్ళిన తర్వాత కన్యాదాతలు ప్రస్తుతానికి వివాహం జరపడానికి తమ అశక్తతనే తెలియజేశారు. రఘు దగ్గరనుండి జవాబు రాసడానికిముందే గోపాలంగారికి యీ జాబులు అందడం జరిగింది.

ఆయనకూ, భార్యకూ యీ సంఘటనలు మిక్కిలి ఆశ్చర్యాన్ని కలిగించాయి.

ఒకటి కాదు; రెండుకాదు, వచ్చిన నాలుగయిదు సంబంధాలూ యీ విధంగా తప్పిపోవడంలో కారణం యేమిటో వారికి బోధపడడంలేదు.

*　　*　　*

రఘుకు తప్పిపోయిన సంబంధాలన్నీ ఒక్క ఊరునుంచి — ఏలూరునుంచి వచ్చినవే! మొదట్లో కారణం తెలియకపోయినా తర్వాత మెల్లమెల్లగా బయటపడింది, వరునిలో ఏదో లోపం వుందనీ, అందువల్లనే కట్నాలూ, కానుకలూ అడగకుండా—వాటి సంగతి తలపెట్టవద్దని చెప్పుతూ కూడా పెళ్లికుమారుడి తలిదండ్రులు సమ్మతించారనీ, అందువల్ల కన్యాదాతలు యిష్టపడలేదనీన్నీ. ఈవార్త వన్నెలతోను, చిన్నెలతోనూ ఆ వూళ్లో వ్యాపించింది. వరుడికి ఉబ్బసరోగమని కొందరూ, కాదు — క్షయరోగమున్నదని కొందరూ, పెద్దరోగమని కొందరూ చెప్పుకోసాగినారు. కుష్టురోగం కాకపోయినా తెల్లమచ్చల రోగమయినా ఉండితీరాలనీ, అందుచేతనే శరీరంలో ఏభాగమూ కనబడకుండా పూర్తిగా దుస్తు వేసుకునేవుంటాడనీ కొందరి వ్యాఖ్యానం!

ఏలూరులోవున్న పరిచితుల జాబులవల్ల యీ సమాచారాలన్నీ గోపాలంగారికి తెలిశాయి.

ఆయనకు చాలా ఆశ్చర్యం కలిగింది.

వరశుల్కం గ్రహించడానికి తాము సమ్మతించకపోవడం మూలంగా కన్యాదాతలకు లేనిపోని అనుమానాలు కలగడమూ, రఘుకు దీర్ఘరోగాలను కల్పించడమూ గోపాలం దంపతులకు తీవ్రమైన మనోవేదనను కలిగించాయి.

తామయినా ప్రయత్నించి వేగంగా వివాహంచెయ్యకపోతే యికమీద రఘుకు పెళ్లి జరగడం కష్టమని వారికి తోచింది. కొందరు ఆప్తులు యీ విషయమై ప్రయత్నించారు. కాని ప్రయోజనం లేకపోయింది.

రఘుకు ఏదో రోగమున్నదనే ప్రచారం జరగడమే దీనికి కారణం.

రఘు తండ్రికి యిది యిప్పుడు బాగా అవగతమైంది. దీనికి ప్రతికారం యేమిటా? అనే ఆలోచనలోపడ్డాడాయన.

చివరికొక నుంచి ఆలోచన తట్టింది.

కాని, ఆ ఆలోచనను ఆయన తన మనస్సులోనే గోప్యంగా ఉంచుకొన్నాడు. తుదకు భార్యకుకూడా చెప్పడానికి యిష్టపడలేదు.

తన ఆలోచనను ఆచరణలో పెట్టుటకు మాత్రం ఆయనకింకా అవకాశం లభించలేదు.

ఒక యేడాది గడచినది.

ఈలోపున తండ్రి కొడుకులకు ఉత్తర ప్రత్యుత్తరాలు వెనుకటి మాదిరిగా తరచు జరగడంలేదు. ఎప్పుడప్పుడు క్షేమసమాచారాలకయి మాత్రం జాబులు వ్రాయడం జరిగేది.


ఒకనాడు అనుకోకుండా ఒక జాబు వచ్చింది.

కాకినాడలో పేరు ప్రఖ్యాతులు గడించి, విశేషధనాన్ని ఆర్జిస్తున్న రామారావు అనే లాయరు వ్రాసిన జాబు అది!

అందులోని విషయం యేమిటంటే – ఆ లాయరుగారికి ఒక కుమార్తె ఉన్నది. కాకినాడ కాలేజీలో పి. యు. సి. చదివి వున్నది. పయి చదువు తల్లికి యిష్టపడనందున చదువు ముగించినది. తల్లిమాటపైనున్న గౌరవంకొద్దీ, ఆకన్యను గోపాలంగారి కుమారుడు రఘుకుయిచ్చి వివాహం చెయ్యాలని కన్యాదాత కోరిక. వధువు అందంగావుంటుందనీ, అణకువకలదనీ, గృహనిర్వహణపద్ధతులను తల్లివల్లనే నేర్చుకొన్నదనీకూడా ఆ జాబులో ఉంది

వరుని తల్లిదండ్రులు శ్రమ అనుకోకుండా కన్యను చూడడానికి కాకినాడ రావాలనీ, ఆ కీలినివచ్చుటకు అవకాశం లేకపోతే తామే కన్యకను తీసుకొనివచ్చి చూపగలమని కూడా కన్యదాత తెలియజేశాడు.

ఆ వకీలుగారిని గురించి గోపాలంగారికి యింతవరకూ తెలియదు. తమ కుటుంబాన్నిగురించి ఆ లాయరుగారికి ఎలా



తెలిసిందో — తన చిరునామా ఎలా తెలిసిందో అని గోపాలంగారికి ఆశ్చర్యం కలిగింది. ఎవరో తన పరిచితులవల్ల — తెలిసివుండ వచ్చునని ఆయన మనస్సును సమాధాన పరచుకున్నారు కూడా.

కన్యను తమవూరికి రప్పించడం భావ్యం కాదని ఆయన అనుకున్నారు. వెనుకటి పరిస్థితులనుబట్టి చూచినా, అది అనుకూలమైనదికాదనే తోచి, తామే కాకినాడకు వస్తున్నట్లు రామారావుగారికి గోపాలం గారు తెలియజేశారు.

మరొక వారంరోజులలో అయనభార్యతో కూడా కాకినాడకు వెళ్ళారు.

చూపులు జరిగాయి. వధువు అన్నివిధాల నచ్చింది ఆ బాలికనుగురించిన వివరాలన్నీ తెలుసుకున్నాక రఘుకూడా యీ సంబంధానికి తప్పకుండా సమ్మతిస్తాడనే అభిప్రాయం వారికి కలిగింది.

'బావగారూ! మీ సంబంధంచేసుకోవా లనే సంకల్పం మాకు మనసారా ఉన్నది. మా అబ్బాయికూడా దీనికి తప్పకుండా సమ్మతిస్తాడనే నమ్మిక మాకు ఉంది. మనం నిశ్చయించేసుకుని యీ విషయం తెలియజేద్దాం' అని గోపాలంగారే ప్రారంభించారు.

'చాలా సంతోషం. అలాగే చెయ్యవచ్చును. మరి — కట్నం విషయంలో బావగారి అభిప్రాయం ఏమిటో తెలుసుకోవలెనని ఉన్నది' అన్నారు కన్యదాత.


'అమ్మాయి లక్షణంగా — అనుకూలంగా ఉండాలి గాని, కట్నం అంత ముఖ్యం కాదు గదా! అయినా తమ అభిప్రాయాన్ని మొదట తెలియజేస్తే సంతోషిస్తాను.'

'నాకు ఒక్కర్తే కుమార్తె. ఈ వివాహం బాగా చెయ్యవలెనని నా సంకల్పం. కుమారుడి వివాహం గురించి నా కంత చింతలేదు. అది ఎలాగయినా జరగనియ్యండి. ఈ వివాహం కాస్త బాగా జరగాలంటే యీ కాలంలో పదివేలయినా ఖర్చవుతాయి. ఆ మాత్రం మొత్తం వరదక్షిణ యివ్వాలని మా సంకల్పం. ఇరవైవేలతో యీ శుభ కార్యం జరిగితే మాకు సంతోషంగా ఉంటుంది.'


# వుడ్‌వార్డ్స్‌తో

## మీ శిశువును ఆరోగ్యంగాను, ఆనందంగాను వుంచండి

వుడ్‌వార్డ్స్, కడుపునొప్పి, పుల్లదనం, కడుపు ఉబ్బరం, పళ్లు వేయునవుడు కలిగే జబ్బులకు తక్షణ నివారణ కలిగించును. వుడ్‌వార్డ్స్ గ్రైప్ వాటర్‌ను సర్వదా సిద్ధంగా వుంచుకోండి!



ఫోన్ 243

No.638
శారదా (REGD)
ఆభరణములు
బంగారు కవరింగ్ చేయబడినవి
5 సం॥ గ్యారంటీ

No. 785
శారదా గోల్డ్ కవరింగ్ వర్క్స్
చిలకలపూడి P.O. మచిలీపట్నం-2

పెబ్బ్రాంచి
వెంకటేశ్వర మున్సిపల్ మార్కెట్
వినాయకస్వామి గుడివద్ద,
మెయిన్ రోడ్ — గుడివాడ.

# ఎదురుతిరిగిన ఆదర్శం

'మీ ఆలోచన చక్కగానే ఉన్నది. మా అబ్బాయి పెద్ద చదువులు చదివి కేంద్రప్రభుత్వంలో మంచి ఉద్యోగంలో ఉన్నాడు. నెలకు ఆరువందలు తెచ్చుకుంటున్నాడు. మీరూ మంచిస్థితిలో ఉన్నారు. మన తాహతులకు తగిన విధంగా ఉండడం ధర్మం. ఈ రోజుల్లో మనవంటివారు వివాహం జరపడానికి పాతిక వేలయినా ఉండాలి. వివాహ ఖర్చులకు పదివేలు కావలసినదే! తమరు పదిహేనువేలు వరదక్షిణకు సమ్మతించగలరని నా అభిప్రాయం.'

'వరుని యోగ్యతను అనుసరించి పదిహేనువేలు అడగడం న్యాయమే! ప్రస్తుతం నేను మనవిచేసిన పైకానికే ప్రయత్నించవలసి ఉన్నది. చేతిలో అంత మొత్తం లేదు. ముందు ముందు పండుగులకూ, పర్వాలకూ, లాంఛనాలకూ ఎక్కువగానే వరునికి ముట్టుతూ ఉండగలదు. ప్రస్తుతం మాత్రం తమరు...'

'మా అబ్బాయికి ఎన్నో సంబంధాలు వస్తున్నాయి. మేము కోరిన కట్నం యివ్వడానికి కొందరు సిద్ధముగానూ ఉన్నారు. అయినా, మా దంపతులిద్దరికీ నచ్చినందున తమతో బంధుత్వానికి సిద్ధపడుతున్నాం. మా రఘు చిన్నబుచ్చుకోకుండా వుండాలని మా కోరిక. అందువల్లనే నిష్కర్షగా యిలా చెప్పవలసి వచ్చింది.

'ఇలాంటి విషయాల్లో మా కుర్రవాని సలహా కూడా తీసుకోక స్వతంత్రించి నిర్ణయించడం నా కిష్టంలేదు. వాని మూలంగానే తమ పరిచయభాగ్యం పొందడానికి అవకాశం కలిగింది. వారం దినములలో తమకు లేఖ మూలంగా తెలియజేస్తాను.'

'అయితే మా రఘును మీ పిల్లవాడు ఎరుగునన్నమాట.'

'ఎరుగును. ఇద్దరికీ కొంత పరిచయం వున్నట్లు మా కుర్రవాడు వ్రాశాడు.

'చాలా సంతోషం.'

* * *

ఇంటికి రాగానే గోపాలంగారు వివరాలు తెలుపుతూ కుమారుడికి జాబు వ్రాశారు. ఆ జాబు అందేలోపలనే రఘు దగ్గరనుంచి ఒక జాబు వచ్చింది. శ్రీధర్ తనకు మిత్రుడనీ, ఢిల్లీలోనే పని చేస్తున్నాడనీ, వారు మన శాఖవారే అనీ, అతనికి ఒక చెల్లెలు ఉన్నదనీ, చదువుకున్నదనీ. లక్షణంగా ఉంటుందనీ, ఈ మధ్య తండ్రితో కూడా ఢిల్లీకి వస్తే ఒకసారి తాను చూడడం తటస్థించినదీ, ఆ అమ్మాయిని వివాహం చేసుకోవాలని యిప్పుడు తన్ను నిర్బంధంగా అడుగుతున్నాడనీ—అందులో ఉన్న విషయం. ఆ అమ్మాయి ఫోటో కూడా ఆ జాబుతో చేర్చి పంపబడింది. తీరాచూస్తే ఆ వధువు తాము కాకినాడలో చూచిన రామారావు గారి కుమార్తెయే !

రఘు తలిదండ్రుల అభిప్రాయాన్ని కోరాడు. తాము నిశ్చయించిన కన్యను గురించే రఘు వ్రాసినందున—వారికి చాలా సంతోషం కలిగింది.

మర్నాడు కాకినాడనుంచి కూడా జాబు వచ్చింది. గోపాలంగారు కోరినట్లు పదిహేనువేలూ కట్నమివ్వడానికి సమ్మతించినట్లు రామారావుగారు వ్రాశారు.

'అతడు కోరిన కన్యనే రఘుకు యిచ్చి వివాహంచెయ్యడానికి నిర్ణయించినట్లున్నూ కొద్దిరోజుల్లోనే ముహూర్తం నిర్ణయింపబడునట్లున్నూ గోపాలంగారు కుమారునికి తెలియజేశారు.


* * *

మరికొద్దిరోజుల్లో రఘుకూ, ఇందిరకూ వైభవంగా వివాహం జరిగింది.

వివాహసమయంలో వరదక్షిణయిచ్చే సమయంలో కట్నం మొత్తాన్ని ఒక కవరులో పెట్టి చక్కని పళ్ళెంలోఉంచి మామగారు అల్లుడికి అందించారు. రఘు, దాన్ని తండ్రికి అందించాడు.

గోపాలంగారు దాము వధువుకు అలంకారాల నిమిత్తం ఆ పైకం యిస్తున్నట్లు ప్రకటించి, ఆ పళ్ళెము వధువు చేతిలో ఉంచారు.

అక్కడివారందరూ ఆశ్చర్యపోయారు.

పిక్ నిక్
ఆల్ వరల్డ్ 3 బ్యాండ్ 7 ట్రాన్సిస్టర్ + డయోడ్ అందమైన సెట్ గిల్ కాబి

సెట్.ధర రు.228 లెదర్ కేసు. అన్నిపన్నులు లైసెన్సు ఫీజు, మరియు సెల్సుతో సహా, సెట్టు ఒకటికి ఆర్డరుతో ముందుగా రు.25 పంపండి. ఇంగ్లీషులోనే ఉత్తరాలు వ్రాయండి.
HITESHI ELECTRONICS
152-D, Kamlanagar. Delhi 7.

క్రొత్తగా వచ్చినవి

ఆకర్షణీయమైన డిజైనులలోను, రంగులలోను సరికొత్త "కాశ్మీరు బ్యూటీ" చీరలు. పెద్ద సైజు మావద్ద మాత్రమే లభించును: వెల రు. 8/-, 2 చీరలు రు. 15/- 3 చీరలు రు. 21/-, 4 చీరలు రు. 27/-. డీలక్స్ రకం చీరలు రు. 10/-, 2 చీరలు రు.19/-, 3 చీరలు రు. 27/-, 4 చీరలు రు. 35/-. ఏదైనా 2 లేక అంతకు మించి చీరలు కొన్నవారికి జాకెట్టు పీసు ఉచితము. వి. పి. పోస్టు పార్సల్ ద్వారా మీ ఇంటివద్ద డెలివరి చేయబడును.
Ambica Saree Bhandar(PTW-30)
6815-Mandelia Road. Delhi-7